

కవాడిగూడ ఉన్నికోట వద్ద దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న సర్కిల్ 15 డీఎంసీ, ఏఎంహెచ్‌ఓ ప్రవీణ

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

కవాడిగూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని సర్కిల్ 15 డీఎంసీ రామానుజులు రెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణ అన్నారు. భారీ వర్షం కారణంగా శుక్రవారం కవాడిగూడ డివిజన్‌లోని పలుప్రాంతాలలో జీహెచ్‌ఎంఎసీ, హెల్త్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి దోమల నిల్వ ప్రాంతాలపై అవగాహన కల్పించారు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎంటమాలజీ వింగ్ ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన కల్పించారు.



భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నూతన ప్రధాన కార్యదర్శి రావినూతన శశిధర్, ఉపాధ్యక్షుడు కె.అగర్వాల్, కార్యదర్శి ఆలె భాస్కర్, బద్దం మహిపాల్‌రెడ్డిలను శుక్రవారం హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ రాంనగర్‌లోని తన నివాసంలో వారిని సత్కరించారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

శేషసాయికి 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకం అందజేత

రాంనగర్, ఆంధ్రజ్యోతి: తను రాసిన 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేషసాయికి శుక్రవారం రాంనగర్‌లోని తన నివాసంలో బండారు దత్తాత్రేయ అందజేశారు. శేషసాయి మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని దత్తాత్రేయ చేతులమీదుగా తీసుకోవడం సంతృప్తి కలిగిందన్నారు.

మంచినీటి లోప్రెషర్ నివారణకు చర్యలు : ఉమాదేవి

బర్కత్‌పుర, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ డివిజన్‌లో మంచినీటి లోప్రెషర్ నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. శుక్రవారం చప్పల్‌బజార్‌లో మంచినీటి నల్లాల్లో లోప్రెషర్ సరఫరా అవుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు ఆమె ఆ ప్రాంతాన్ని సందర్శించి వివరాలడిగి తెలుసుకున్నారు. జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి లోప్రెషర్ నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు భీమ్‌రాజ్, రవియాదవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై కేసులను కొట్టివేయాలి

చిక్కడపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన కేసులను తక్షణమే బేషరతుగా కొట్టివేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం చిక్కడపల్లిలోని రాష్ట్ర జేఏసీ కార్యాలయంలో ప్రఫుల్‌రాంరెడ్డి అధ్యక్షతన జరిగింది.



నివాళులర్పిస్తున్న కళాజనార్దనమూర్తి తదితరులు

తెలుగు సాహితీ సంపద.. కరుణశ్రీ కావ్యాలు

చిక్కడపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి రచించిన పుష్పవిలాపం మధురగాయకుడు ఘంటసాల గానంతో జగద్విఖ్యాతి పొందిందని ఎస్‌బిఐ మాజీ ఏజీఎం, ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావు అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా శుక్రవారం రాత్రి జంధ్యాల పాపయ్యశాస్త్రి యాదిలో కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. సభలో పాల్గొన్న త్రినాథరావు మాట్లాడుతూ జంధ్యాలపాపయ్యశాస్త్రి ప్రతీ కవిత కరుణతో కూడుకుని ఉంటుందన్నారు. ఆయన రాసిన పలు కావ్యాలు కుంతీకుమారి, అరుణశ్రీ తెలుగు సాహితీ సంపద అన్నారు. గానసభ సభ్యుడు శంకరప్రసాద్, పిఎంకె గాంధి, గాయని మంగరాజు రుక్మిణి, సీతారామయ్య పాల్గొన్నారు.

ప్రారంభం కానున్న కమ్యూనిటీహాల్ పనులు

చిక్కడపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ పునర్‌నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్ 15 డిఎంసి రామానుజులురెడ్డి, ఇంజనీరింగ్ విభాగం డిఈఈ గీత, ఎఇ అబ్దుల్‌సలామ్‌లతోపాటు ఎస్ఆర్‌టి జవహర్‌నగర్ వ్యాయామశాల ఆటస్థలం, కల్యాణమండపం పరిరక్షణ కమిటీ సభ్యులతో కమ్యూనిటీహాల్‌లో ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్యూనిటీహాల్ అభివృద్ధిలో భాగంగా పునర్‌నిర్మాణ పనులకోసం సుమారు రూ.26 లక్షలు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో జీహెచ్‌ఎంసీ నిధులు మంజూరు చేసిందని పనులు త్వర లో ప్రారంభం కానున్నాయని వివరించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, కమ్యూనిటీహాల్ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు నర్సొట్ట మల్లేష్, సభ్యులు గుండు మహేందర్, ఎం. కృష్ణ, జగదీష్, దినేష్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు

బర్కత్‌పుర, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : బర్కత్‌పురలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో ఈ నెల 9 నుంచి 12 వరకు శ్రీ రాఘవేంద్ర స్వామి 354వ ఆరాధన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మఠం మేనేజర్ అనిల్ తెలిపారు. ఈ ఆరాధనోత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9న సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి పూజ, ధ్వజారోహణం, లక్ష్మీపూజ, సాయంత్రం రథోత్సవం, 10న పూర్వ ఆరాధన, శ్రావణ పాండ్యమి, 11న మధ్యారాధన, 12న ఉత్తర ఆరాధన పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



బీపీ మండల్, పండుగ సాయన్నల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ : బాలగౌని

రాంనగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీహార్ మాజీ సీఎం బీపీ మండల్ అని బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లిలోని పొలిటికల్ ఫ్రంట్ కార్యాలయంలో బీపీ మండల్, పండుగ సాయన్నల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన ఫ్రంట్ రాష్ట్ర నాయకులు అయిలి వెంకన్నగౌడ్, యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, అంబాల నారాయణగౌడ్‌లతో కలిసి మాట్లాడారు. నాడు 40 ప్రతిపాదనలతో మండల్ కమీషన్ సమర్పించిన తర్వాత 1990 ఆగస్టు 7న కమీషన్ సిఫార్సులలో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందిన రోజు అని గుర్తు చేశారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



ముషీరాబాద్ మహాకాళి దేవాలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



వరలక్ష్మి వ్రతంలో బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి



కవాడిగూడలో అమ్మవారికి పూజలు

ముషీరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతం భక్తులు వైభవంగా జరిపారు. తెల్లవారుజామునే ఆలయాలకు పెద్ద ఎత్తున తరలివెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహాకాళి దేవాలయంలో భక్తులు బారులుతీరి అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు కుంకుమ, తీర్థప్రసాదాలను అందజేశారు. ఎక్కడ చూసినా వరలక్ష్మి వ్రతం శోభ సంతరించుకుంది.

చిక్కడపల్లిలో..

చిక్కడపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు కన్నులపండువగా జరిగాయి. ఆలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి, చిక్కడపల్లి యూనియన్ బ్యాంక్‌లేన్‌లోని శ్రీ నల్లపోచమ్మ, జవహర్‌నగర్ లలితాపరమేశ్వరి, బాపునగర్ రాజరాజేశ్వరి మాత ఆలయాల్లో మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

కవాడిగూడలో..

కవాడిగూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న అమ్మవారి దేవాలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం కవాడిగూడ డివిజన్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ కనకాల కట్టమైసమ్మ దేవాలయం, అడ్వకేట్ కాలనీలోని బాల త్రిపుర సుందరీ దేవి ఆలయం, తదితర అమ్మవారి ఆలయాల్లో మహిళలు తెల్లవారు జామునుంచే అర్చనలు అభిషేకాలు చేయించారు. బాల త్రిపుర సుందరీ దేవి ఆలయంలో వేడుకల్లో ఆలయ ఛైర్మన్, మాజీ కార్పొరేటర్ రవీందర్, బస్తీ వాసులు శ్రీనివాస్ ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ఒడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అలంకరణలో అమ్మవారు

రైతుకూలీలు, కార్మికుల కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం

ఐఎల్‌వో డైరెక్టర్ మిచికో మియమోటో

చిక్కడపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఐఎల్‌వో (ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్), రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కార్మికులకు కనీస వేతనాల కల్పన, గిగ్ కార్మికవ్యవస్థ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై కలిసి పనిచేస్తామని ఐఎల్‌వో డైరెక్టర్ మిచికో మియమోటో తెలిపారు. శుక్రవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆమె కార్మికశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా మిచికో మియమోటో మాట్లాడుతూ ప్రధానంగా రైతుకూలీలు, వలస కార్మికుల హక్కుల పరిరక్షణతో భవిష్యత్తులో కూడా ఈమొత్తం అంశాలపై మరింత పటిష్టవంతంగా ప్రణాళికాబద్ధంగా పనిచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కార్మిక శాఖమంత్రి, కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శులతో కూడా కలిసి సమావేశం అవుతామని వివరించారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ప్రధానంగా కార్మికుల హక్కుల పరిరక్షణ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ఎంతో ప్రగతి సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఐఎల్‌వో నేషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రంజిత్ ప్రకాష్, కార్మికశాఖ అదనపు కమిషనర్ డా. ఇ. గంగాధర్, రంగారెడ్డి జోన్ సంయుక్త కమిషనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఏసీఎల్ ప్రభాకర్, సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ ప్రతినిధి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మిచికో మియమోటో, రంజిత్‌ప్రకాష్, గంగాధర్,చంద్రశేఖర్

బీజేపీ ప్రభుత్వానికి ఏజెంట్‌గా ఎలక్షన్ కమిషన్

బీహార్‌లో అక్రమంగా ఓట్లను తొలగించారంటూ సీపీఎం నిరసన ప్రదర్శన

చిక్కడపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీహార్‌లో అక్రమంగా ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ ఈ ప్రక్రియను నిరసిస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి జేబుసంస్థగా, ఏజెంట్‌గా మారిందని నినాదాలు చేశారు. ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం కేంద్రకమిటీ సభ్యులు ఎస్. వీరయ్య మాట్లాడుతూ బీహార్‌లో జూన్ 25 నుంచి జూలై 25 వరకు నెలరోజుల వ్యవధిలో దాదాపు 62 లక్షల ఓట్లు తొలగించే ప్రక్రియను చేపట్టారని ఆరోపించారు. చిరుద్యోగులు, అసంఘటితరంగ కార్మికులు, రైతుకూలీలు, గ్రామాల్లో నివసించే రైతులు మొత్తంగా బీజేపీకి ఓట్లు పడవు అనుకునే వారి ఓట్లను తొలగించే ప్రక్రియను నిస్సిగ్గుగా చేపట్టారని ఎలక్షన్ కమిషన్‌పై మండిపడ్డారు. సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.వెంకటేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు సుదర్శన్, పాలడుగు భాస్కర్, ఆశయ్య, డీజీ నరసింహారావు, ఎం. శ్రీనివాస్, దశరథ్, నరేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆర్టీసీక్రాస్‌రోడ్‌కు ర్యాలీగా చేరుకుని ప్రదర్శనలో పాల్గొన్నారు.



ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో ర్యాలీగా నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

ఆలయాల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటుచేయాలి



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్నవాజీద్, అశోక్

ముషీరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలో నిర్వహించే బోనాలకు ఆలయాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని భోలక్‌పూర్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగానగర్‌తో పాటు వివిధ ప్రాంతాలలో జరిగే శ్రావణ మాసబోనాల సందర్భంగా ఈ నెల 10, 11 తేదీలలో ఆలయాల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. జోనల్ కమిషనర్‌ను కలిసినవారిలో భోలక్‌పూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అశోక్ పాల్గొన్నారు.

కట్టమైసమ్మ దేవాలయంలో చండీహోమం

కవాడిగూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్ బండ్‌లోని శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో శ్రావణ మాసం పౌర్ణమిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న రుద్రసహిత చండీ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ వ్యవస్థాపక ఫౌండర్ ఛైర్మన్ గౌతమ్‌కుమార్ పటేల్, ఆలయ ప్రధాన అర్చకులు సాత్విక్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ సతీష్ తెలిపారు. శుక్రవారం వారు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో రుద్ర సహిత చండీహోమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఉదయం తెల్లవారు జామునుంచే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు. అర్చనలు పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఇందుకోసం ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

వేంకటేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు

చిక్కడపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు శుక్రవారం కన్నులపండువగా జరిగాయి. ఈసందర్భంగా మూర్తిహోమం, నవకలశస్నపనము, అభిషేకం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, పుష్పాధివాసం, పవిత్రమూర్తిహోమం, వేదప్రబంధపారాయణాదులు ఆరగింపు, మంత్రపుష్పము, తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలను ఆలయ పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో అన్నపూర్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఆలయంలో భక్తుల పూజలు

గ్రేటర్‌లోని అన్ని డివిజన్లలో తిరంగా యాత్రలు

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

బర్కత్‌పుర, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని గ్రేటర్‌లోని అన్ని డివిజన్లలో తిరంగా యాత్రలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 12, 13, 14వ తేదీలో డివిజన్లలో ఉన్న మహనీయుల విగ్రహాలను శుద్ధి చేసి దీపారాధన, పూలమాలలతో నివాళులర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎన్.గౌతమ్‌రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్ గౌడ్, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, యాకర అమృత, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి

ఇంటింటా జాతీయ జెండాలను పంపిణీ చేయాలి

రాంనగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే హర్‌ఘర్ తిరంగా యాత్రను జయప్రదం చేయాలని పార్టీశ్రేణులను అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ కోరారు. శుక్రవారం లలితానగర్ బీజేపీ డివిజన్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి జాతీయ జెండాలను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్. శేషసాయి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు ఉచిత ట్యూషన్లు

రాంనగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బాలోత్సవం విశ్వమానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఉచిత ట్యూషన్లు నిర్వహిస్తున్నామని తెలంగాణ బాలోత్సవం రాష్ట్ర కార్యదర్శి ఎస్.సోమయ్య, విశ్వమానవ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్‌రావు తెలిపారు. నగరంలోని 10, ఇతర జిల్లాల్లోని 10 సెంటర్లలో 23 మంది టీచర్లు బోధిస్తున్నారని వారు తెలిపారు. ఈ ట్యూషన్లలో పాఠశాల పుస్తకాలు మాత్రమే కాకుండా శాస్త్రీయ, సామాజిక అవగాహన, వివిధ రకాల ఆటలు, జాతీయ నాయకుల చరిత్రలు, జనరల్ నాలెడ్జ్, డ్రాయింగ్ వంటి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ట్యూషన్లను పేద విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల కోసం సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

శిథిలావస్థకు చేరినా.. ఎవరికీ పట్టదా?

నల్లకుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్ ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా సమీపంలో ప్రధాన రహదారి పక్కనే శిథిలావస్థకు చేరిన భవనం ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. అయితే ఈ భవనంలో నివసిస్తున్న కుటుంబ సభ్యులు వెంటనే ఖాళీ చేయాలని పలువురు సూచించినా వారు స్పందించడం లేదు. దీంతో స్థానిక కార్పొరేటర్ యాకర అమృత ఈ భవనంపై వెంటనే చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతీదివాకర్, ఏఎంహెచ్‌వో హైమావతి, టౌన్‌ప్లానింగ్ అధికారులకు నెల క్రితం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు ఈ భవనంపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా రోడ్డు పక్కన ప్రమాదభరితంగా మారిన భవనం



భారీ వర్షానికి రాంనగర్‌లో కూలిన ఇళ్లు



బాధితులు శ్రీనివాస్‌తో వివరాలడిగి తెలుసుకుంటున్న టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, ఎస్ఐ, తదితరులు

భారీ వర్షానికి రాంనగర్‌లో కూలిన ఇళ్లు

రాంనగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్‌లో ఓ ఇళ్లు కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాల ప్రకారం.. రాంనగర్‌లోని ఒక 40 గజాల ఇంట్లో 50 సంవత్సరాలకు పైగా ఇంటి యజమాని చుక్క కృష్ణ, ఆయన కుమారుడు నివాసం ఉంటున్నారు. ఇళ్లు పురాతనమైనది కావడంతో ఇటీవల యజమాని, కుమారుడు మరోచోట అద్దెకు ఉంటున్నారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆ ఇళ్లు శుక్రవారం ఉదయం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. విషయం తెలుసుకున్న వెంటనే జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, ఛైర్మన్ అనిల్, న్యాక్ ఇంజనీర్ మౌనిక జేసీబీతో రోడ్డుపై పడ్డ ఇంటి శకలాలతోపాటు దెబ్బతిన్న ఆ ఇంటిని కూల్చివేశారు.

'తొలగించిన కాలేజీల అడ్మిషన్లు పునరుద్ధరించాలి'

బర్కత్‌పుర, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : టీజీ ఎప్‌సెట్ వెబ్‌సైట్ నుంచి తొలగించిన కాలేజీల అడ్మిషన్లు, సీట్ల కేటగిరిల వివరాలను తక్షణమే పునరుద్ధరించాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులను గుర్తించి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎంసెట్ ఇంజనీరింగ్ సీట్ల తారుమారు జాబితాను శుక్రవారం కాచిగూడలో దహనం చేశారు.

నల్లకుంట బీజేవైఎం అధ్యక్షుడిగా కోదాటి సుమన్

నల్లకుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా సంజీవయ్యనగర్‌కు చెందిన కోదాటి సుమన్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి నల్లకుంట డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా సుమన్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా సుమన్ శుక్రవారం నల్లకుంటలో విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లో పార్టీ పటిష్టతకు అంకితభావంతో తాను అందించిన సేవలకు గుర్తించి బీజేవైఎం పదవి కల్పించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. తనకు పదవి కల్పించినందుకు నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ప్రశాంత్‌జోషి, బీజేపీ సెంట్రల్ జోన్ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శిగా బుచ్చిరెడ్డి

రాంనగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శిగా బాగ్‌అంబర్‌పేటకు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు నాయిని బుచ్చిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాయిని బుచ్చిరెడ్డిని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.గోవర్ధన్‌రెడ్డి సత్కరించి అభినందించారు. అనంతరం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ రాబోయే గణపతి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ప్రజలను కోరారు.



బుచ్చిరెడ్డిని సత్కరిస్తున్న ఆనంద్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి

శివశంకర్ జయంతిని జయప్రదం చేయాలి

చిక్కడపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపుల భీష్మపితామహుడు, కేంద్ర మాజీ మంత్రి, మాజీ గవర్నర్ పి.శివశంకర్ 96వ జయంతి వేడుకలు ఈనెల 10న రవీంద్రభారతిలో జరుగుతున్నాయని ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమసంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే దశరథం పటేల్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

లక్ష్మీఉప్పలమ్మ ఆలయంలో రేపు బోనాలు

చిక్కడపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని శ్రీ లక్ష్మీఉప్పలమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల వేడుకలు జరుగుతాయని ఆలయ ఛైర్మన్ వై.సంజీవరెడ్డి, పవన్‌కుమార్, రాధ, ప్రసన్నలక్ష్మి, పద్మావతి తెలిపారు. శుక్రవారం ఆలయం వద్ద వారు మాట్లాడుతూ ప్రతి ఏటా జరిగే ఉత్సవాల్లో భాగంగా ఎంపీలు డా. లక్ష్మణ్, అనిల్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావనివినయ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు.

నేడు ఎంబి చర్చ్‌లో యూత్‌మేళా

చిక్కడపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జనరంజని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం గోల్కొండ చౌరస్తాలోని ఎంబి చర్చ్‌లో యూత్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.గిడియోన్ బాబు తెలిపారు. మంత్రు లు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొనే ఈ కార్యక్రమంలో యువతకు వివాహపరిచయవేదిక, మెడికల్ క్యాంప్, ఉద్యోగమేళా, వ్యాపారం, ఫ్రాంఛైజీ అవకాశాలు వంటి అంశాలు ఉంటాయని వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కవాడిగూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించారు. గాంధీనగర్ ఎస్ఐ నరసింహ వివరాల ప్రకారం.. గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న మెట్రో పిల్లర్ దగ్గర 40ఏళ్ల వ్యక్తి పడి ఉండ డంతో ఒకరు పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసుకున్నారు. మృతుడు యాచకుడై ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.